క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక


అధ్యక్షుడు శ్రీనివాస్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని కాలేజీరోడ్డులో గల గౌతమేశ్వర కాలనీకి నూతన కార్యవర్గాన్ని మంగళవారం కాలనీవాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్కాకుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఉస్కమల్ల చందు, ఉపాధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా తిరుపతి, సంయుక్త కార్యదర్శిగా స్వామి, వెంకటేశ్, గౌరవ అధ్యక్షుడిగా కార్తిక్‌శర్మ, సలహాదారుగా సమ్మిరెడ్డి, ధర్మయ్య, రామన్న, సభ్యులుగా సురేందర్, సంతోశ్ గౌడ్, శంకర్, రమేశ్, తిరుపతి, రామకృష్ణ ఎన్నికైె నట్లు ఎన్నికల నిర్వాహకులు రాజగోపాల్, వరప్రసాద్ తెలిపారు.

భవన నిర్మాణ సంఘం మండల కమిటీ

కాసిపేట: మండల కేంద్రంలో ఏఐటీయూసీ అనుబంధ (భవన నిర్మాణ కార్మిక సంఘం) టీఎస్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జాడి పోశం, అధ్యక్షుడిగా బండారి సత్తయ్య, ఉపాధ్యక్షుడు ఉప్పులేటి మధునయ్య, ప్రధాన కార్యదర్శి గంగాధరి రాజయ్య, సహాయ కార్యదర్శి బోగె సత్తయ్య, కోశాధికారి నల్ల శ్రీనివాస్, కాలువ రాజేష్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్మికుల హక్కులకు పోరాడాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జాడి పోశం, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, జిల్లా నిర్మాణ బాధ్యులు దాగం మల్లేశ్ హాజరై మాట్లాడారు. ప్రతి భవన నిర్మాణ కార్మికుడు ఐదేళ్ల కాలపరిమితి కలిగిన లేబర్ కార్డు తీసుకోవాలన్నారు. ఈ కార్డు ద్వారా ఎన్నో సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు దాడి గట్టయ్య, కొంకుల రాజేశ్, దాగం రాజలింగు, గట్టు సర్వేశం, దుర్గం పోశం, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి అవునూరి రాజు, అధ్యక్షుడు రామగిరి వెంకన్న, లింగన్న పాల్గొన్నారు.

కిసాన్ సంఘ్ ఆవిర్భావ వేడుకలు


జెండా ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు

దండేపల్లి: భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ వేడుకలను దండేపల్లిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంఘ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సమస్యలపై భారతీయ కిసాన్ సంఘ్ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోళ్ళ తిరుపతి, కారుకూరి తిరుపతి, చీర్ల వెంకటేశ్వర్లు, వనపర్తి రాకేశ్, వేముల హరీశ్, అడప సంతోశ్, గుండ రవీందర్, రాపర్తి రాజన్న, మల్లూరి లక్ష్మీనారాయణ, బొమ్మెన మహేశ్, కొత్తపెల్లి రవి పాల్గొన్నారు.

ఫ్లెక్సీ తొలగింపుపై నిరసన


రోడ్డుపై బైఠాయించి నిరసన చేస్తున్న గౌస్

బెల్లంపల్లి: పట్టణంలోని కాంటా చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ తొలగించడంపై కాంగ్రెస్ పట్టణ మైనార్టీ నాయకుడు ఎండీ గౌస్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఉగాది, రంజాన్ పండుగలు పురస్కరించుకుని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఫొటోతో ఉన్న ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తే మున్సిపల్ సిబ్బంది చెత్త బండిలో పడేశారు. దీంతో రోడ్డు వద్ద మంగళవారం ఆయన బైఠాయించి నిరసన తెలిపాడు. వన్‌టౌన్ ఎస్సై రాకేశ్ ఘటనాస్థలికి చేరుకుని ఆయన్ను సముదాయించారు. తొలగించిన ఫ్లెక్సీని తిరిగి సిబ్బంది చౌరస్తాలో ఏర్పాటు చేయడంతో వివాదానికి తెర పడింది.

'సీఎం వ్యాఖ్యలు సరికాదు'

మంచిర్యాలటౌన్: ఉపాధ్యాయులను చులకన చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని తపస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శ్రీనివాసరావు, బగ్గని రవికుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థుల కోసం ఇచ్చే సెలవులే ఉపాధ్యాయులకు ఇస్తున్నారని, అదనంగా పనిచేసేందుకు వారు ఎప్పుడూ సిద్ధంగా ఉన్నారన్నారు. దేశంలో ఏడాదిలో 223 పనిదినాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం తరఫున జరిగే సర్వేలు, ప్రతీ ఎన్నికల్లో విధులు, బడిబాట, మూల్యాంకన విధులు, సప్లిమెంటరీ పరీక్షల విధులను నిర్వహించే బాధ్యతలను చేపడతామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో ఐదు డీఏలు పెండింగ్‌లో లేవన్నారు. వెంటనే వాటిని ప్రకటించి, పెండింగ్ బిల్లులను క్లియర్ చేసి, పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

మినీస్టేడియం పూర్తయ్యేనా?

- ఏడాదైన పూర్తికాని వైనం
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా స్టేడియం
- పట్టించుకోని అధికారులు



ఇండోర్ స్టేడియం

చెన్నూర్: క్రీడాకారులకు చెన్నూర్ పెట్టింది పేరు. ఈ ప్రాంత క్రీడాకారులకు స్థానికంగా ఉన్న మైదానంలో సాధన చేస్తూ రాష్ట్ర జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. వీరికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ హయాంలో 2021లో పట్టణంలో మినీ స్టేడియం నిర్మాణానికి రూ. 2.60 కోట్ల నిధులు మంజూరయ్యాయి. నిర్మాణ పనులు ప్రారంభించి 2024 నాటికి పూర్తయింది. కాంపౌండ్, ఇండోర్ స్టేడియం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏడాది కావస్తున్నా నేటికి పూర్తి కాలేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా స్టేడియం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. రాత్రివేళ అకతాయిలు స్టేడియంలోని గదుల తాళాలను పగులగొట్టినట్లు సమాచారం.

రాణిస్తున్న క్రీడాకారులు

చెన్నూర్, కోటపల్లి మండలాల్లో వందలాది క్రీడాకారులు ఉన్నారు. ఈ మండలాల్లో 50 మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రాణిస్తున్నారు. కస్తూర్బా, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు ఆటల్లో సత్తా చాటుతున్నారు. మినీ స్టేడియం పనులు పూర్తి చేసి ప్రారంభించినట్లైతే కోచ్‌తోపాటు వివిధ క్రీడలు సాధన చేసేందుకు అవకాశం ఉంటుంది. జిల్లా అధికారులు మినీ స్టేడియం పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు.


స్టేడియం గది

అకాడమీ ఏర్పాటుతో క్రీడాభివృద్ధి

మినీ స్టేడియం ప్రారంభించి ఏద్దైన ఒక క్రీడాభివృద్ధి కోసం అకాడమీ ఏర్పాటు చేస్తే వందలాది క్రీడాకారులకు మేలు జరుగుతుంది. స్టేడియంలో క్రీడాకారులకు సౌకర్యాలు కల్పించి కోచ్‌లు ఏర్పాటు చేసి ప్రాక్టీస్ చేయిస్తే అంతర్జాతీయ క్రీడా పోటీల్లో రాణించే సత్తా అవకాశం ఉంది. స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు స్పందించి మినీ స్టేడియం పనులు పూర్తి చేసి ప్రారంభించాలని పలువురు క్రీడాభిమానులు కోరుతున్నారు.

పనులు పూర్తిచేయాలి

చెన్నూర్‌లో చాలామంది క్రీడాకారులు ఉన్నారు. స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో రోజు ప్రాక్టీస్ చేస్తున్నారు. మినీ స్టేడియం పనులు పూర్తి చేసి సౌకర్యాలు కల్పిస్తే క్రీడాకారులు మేలు జరుగుతుంది.

– కారెంగుల రామయ్య
గురుకృపా స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి చెన్నూర్

స్టేడియం అప్పగించాలి

తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత మినీ స్టేడియాన్ని సందర్శించాను. మినీ స్టేడియంలో కొంత పెండింగ్ పనులు ఉన్నాయి. సదరు కాంట్రాక్టర్ పనులు పూర్తి చేసి స్టేడియాన్ని మాకు అప్పగిస్తే క్రీడాభివృద్ధికి కృషి చేస్తాం.

– రాజువీరు, డీవైఎస్‌వో, మంచిర్యాల

స్తంభాన్ని సరిచేశారు..

సాక్షి ఎఫెక్ట్..



భీమారం: భీమారంలోని గొల్లదుబ్బ ప్రాంతంలో వంగిన స్తంభం శీర్షికన గతనెల 31న సాక్షిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. మంగళవారం విద్యుత్ అధికారులు, సిబ్బంది వంగిన స్తంభాన్ని, వేలాడుతున్న సరిచేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే ఓదెలుకు పరామర్శ

మందమర్రిరూరల్: మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు నల్లాల ఓదెలు అనారోగ్యంతో నెలరోజులుగా చికిత్స పొందుతున్నాడు. మంగళవారం హైదరాబాద్‌లోని బ్రీనోవా ట్రాన్స్‌లేషన్ కేర్ ఆసుపత్రిలో ఓదెలును చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పరామర్శించారు. ఆయన ఆరోగ్యపరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.


ఓదెలు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

ఆడిట్ నిర్వహించాలని ఆందోళన

లక్సెట్టిపేట: మండలంలోని కొమ్ముగూడెంలో బ్రహ్మంగారి గ్రామైఖ్య సంఘంలో లావాదేవీలో అక్రమాలపై ఆడిట్ నిర్వహించాలని సభ్యులు డిమాండ్ చేశారు. గ్రామంలో సంఘం కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యుల లావాదేవీలో సీఏ సత్యవతి రికార్డులన్నీ తన వద్ద ఉంచుకుని తాళం వేసిందన్నారు. ఈ విషయమై గతనెల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్త్రీ నిధి ఖాతాలో నిధుల జమ విషయంలో పలు అనుమానాలు ఉన్నాయన్నారు. ఈ విషయమై ఏపీఎం లక్ష్మిని వివరణ కోరగా సభ్యుల కోరిక మేరకు గతనెల సమావేశానికి హాజరైనప్పటికీ సీఏ రాలేదన్నారు. దీనిపై ఆడిట్ నిర్వహించి, నిధుల అక్రమాలు జరిగితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.


ఆందోళన చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

కాసిపేట: సీపీఎం, ప్రజాసంఘాల నాయకుల అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి పేర్కొన్నారు. మంగళవారం సోమగూడెంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏడవ గ్యారంటీకి సమాధి, నిర్బంధంతో పాలన ఇదేనా కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీ అని ప్రశ్నించారు. తెలంగాణలో నిర్బంధాలు, అడ్డుగోడలు, అంక్షలుండవు ప్రజలకు ఆరు గ్యారంటీతోపాటు 7వ గ్యారంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని చెప్పిన పాలకులు ఆచరణలో విఫలమయ్యారని ఆరోపించారు. హెచ్‌సీయూకి చెందిన 400 ఎకరాల భూమి కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు రియల్ మాఫియా ప్రభుత్వం లాగా వ్యవహరిస్తోందన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో చలో యూనివర్సిటీకి పిలుపు నేపథ్యంలో హైదరాబాద్ వెళ్తున్న పార్టీ, ప్రజాసంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేయడం హేయమైన చర్యగా అని పేర్కొన్నారు.

ముందస్తు అరెస్టులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో సీపీఎం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. హెచ్‌సీయూ భూములను లీజుకు ఇవ్వడాన్ని విరమించుకోవాలని ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో బెల్లంపల్లిలో నాయకులను తాళ్లగురిజాల పోలీసులు అదుపులో తీసుకున్నారు. పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి గోమాస అశోక్, సభ్యుడు చల్లూరి దేవదాస్‌ను కొన్ని గంటల తర్వాత వదిలిపెట్టారు.


తాళ్లగురిజాల ఠాణాలో ఉన్న సీపీఎం శ్రేణులు

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

పాతమంచిర్యాల: హెచ్‌సీయూ విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ సంఘాల నాయకులను పోలీసుల నిర్బంధించడాన్ని ఖండిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ ఓ ప్రకటనలో తెలిపారు. వర్సిటీ భూముల పరిరక్షణ కోసం హెచ్‌సీయూ గేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే ధర్నాకు వెళ్తున్న సీపీఎం నాయకులను రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా అరెస్టు చేయడాన్ని పార్టీ ఖండిస్తుందని తెలిపారు. అరెస్టు చేసిన వారిని భేషరతుగా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

భగీరథ ట్యాంకు..బడి!

ఫొటోలో కనిపిస్తున్న ఈ చిత్రాన్ని చూస్తే బడి బంగ్లాపైన భగీరథ నీళ్ల ట్యాంకు నిర్మించినట్లు ఉంది కదూ.. అలా అనుకుంటే పొరబడినట్లే. ఎందుకంటే దండేపల్లి మండలం దుబ్బగూడ (ఎల్)పాఠశాల వెనకాల భగీరథ నీళ్ల ట్యాంకు నిర్మించారు. పాఠశాల ముందు నిలబడి చూస్తే బడి బంగ్లాపై నీళ్ల ట్యాంకు నిర్మించినట్లు కనిపిస్తుంది.

– దండేపల్లి



వనం పక్కనే మురుగునీరు

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎల్లక్కపేటలో సరైన మురుగుకాల్వలు లేవు. ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరంతా ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఉన్న ప్రకృతి వనం పక్కనే చేరుతుంది. దీంతో దోమలు వృద్ధి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు పట్టించుకుని మురుగుకాల్వలు నిర్మించాలని కోరుతున్నారు.



1,105 మంది భక్తుల మాలధారణ

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీహన్మాన్ ఆలయంలో మంగళవారం 1,105 మంది భక్తులు హన్మాన్ మాలాధారణ గావించారు. మాలధారణ చేసుకున్న అనంతరం భక్తులు గుట్టపై శ్రీసత్యనారాయణస్వామిని దర్శించుకున్నారు. దీంతో గూడెం ఆలయ ప్రాంగణాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.

భీమారం: మండలంలోని పోతన్‌పల్లిలోని హనుమాన్ ఆలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో హన్‌మాన్ దీక్ష కోసం మాలధారణ చేశారు. వివిధ గ్రామాల భక్తులు హనుమాన్ దీక్షలను తీసుకున్నారు. వీరికి గ్రామస్తులు స్వాగతం పలికారు.


దండేపల్లి: మాలధారణకు హాజరైన భక్తులు

సెల్‌ఫోన్ అప్పగింత

తాండూర్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధిత యువతికి మంగళవారం సీఐ కుమారస్వామి అప్పగించారు. గతనెల 21న శ్రీనిధి తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుంది. సీఈఐఆర్ యాప్‌లో వివరాలు నమోదు చేసింది. ఈ మేరకు ఆచూకీ కనుగొని బాధితురాలికి సదరు సెల్‌ఫోన్‌ను సీఐ అప్పగించారు.

సన్నబియ్యం ప్రభుత్వ ఉగాది కానుక

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జన్నారం: రాష్ట్రప్రభుత్వం ఉగాది కానుకగా ప్రజలకు సన్నబియ్యం అందిస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని రేషన్ షాపులో సన్నబియ్యం పంపిణీని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తోందని తెలిపారు. ప్రజా ప్రభుత్వ హయాంలో పేద ప్రజలకు మేలు జరుగుతోందని అన్నారు. రూ.50తో కొనుగోలు చేసిన సన్న బియ్యాన్ని ఉచితంగా సరఫరా చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో ఉమర్ షరీఫ్, ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్‌అలీ ఖాన్, నాయకులు రాజశేఖర్, ఇసాక్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలో పేద ప్రజలందరికీ సన్నబియ్యం అందించాలనే ఉద్దేశంతోనే రేషన్ షాపుల ద్వారా పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాల రేషన్ షాపులో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. పేద వారికి పట్టెడన్నం పెట్టాలన్న ఆలోచనతోనే సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించామని, ఇది చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే పథకమన్నారు. మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

తాండూర్: రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మాదారంలో మంగళవారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఫుడ్ కార్పొరేషన్ సభ్యుడు పులగం తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, గ్రంథాలయ సంస్థ మాజీ జిల్లా అధ్యక్షుడు ఎస్.మహేందర్‌రావు, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాలిగామ బానయ్య, కాంగ్రెస్ నాయకులు దామోదర్‌రెడ్డి, శ్రీను, లక్ష్మణ్, మోమిన్ అలీ, వెంకటస్వామి, మాజీ సర్పంచ్ సుభాష్ పాల్గొన్నారు.


బియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే


ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షురాలు

సన్న బియ్యం పథకం కేంద్రానిదే

చెన్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నట్లుగా సన్న బియ్యం పథకం రేవంత్‌రెడ్డిది కానీ, రాష్ట్ర ప్రభుత్వానిది కాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. పట్టణంలో మంగళవారం మాట్లాడారు. కరోనా సమయం నుంచి ప్రతి వ్యక్తికి ఐదు కేజీల బియ్యం మోదీ ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని తెలిపారు. బియ్యం పంపిణీ కార్యక్రమం వడ్ల సేకరణతో ప్రారంభమవుతుందని, వడ్ల సేకరణలో గోనె సంచుల, సుతిలీ తాళ్లు, ట్రాన్స్‌పోర్టు, హమాలీ మొత్తం కేంద్ర ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వడ్లకు చెల్లించాల్సిన మొత్తాన్ని బ్యాంకులో అప్పు రూపంలో తీసుకువస్తుందని ఆ మొత్తానికి వడ్డీ కూడా కేంద్రమే చెల్లిస్తుందని వెల్లడించారు. ఇంత చేస్తున్నా .. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం బియ్యం పంపిణీ తామే చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటోందని ఆరోపించారు. రేషన్ షాపులలో రేవంత్‌రెడ్డి చిత్ర పటం పెట్టి, నరేంద్రమోదీ చిత్ర పటాన్ని పెట్టకపోవడం సరికాదన్నారు.


మాట్లాడుతున్న వెంకటేశ్వర్ గౌడ్

కాసిపేట: మండలంలోని పంచాయతీల పరిధిలో రేషన్‌షాపుల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. పేదల కడుపు నింపేందుకు ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తోందన్నారు.

చెన్నూర్: పట్టణంలో రేషన్ షాపుల్లో సన్న బియ్యాన్ని పంపిణీని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చెన్న సూర్యనారాయణ ప్రారంభించారు. నాయకులు డీసీసీ కార్యదర్శి ఖలీల్, నాయకులు పాతర్ల నాగరాజు, లింగంపల్లి మహేశ్, ముంతజీర్, సయ్యద్ సాహిర్, అన్వర్, సుల్తాన్, కమలాకర్, కరీం పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పథకాన్ని ఆర్‌జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు త్రిమూర్తి, లక్సెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్‌చంద్ మంగళవారం ప్రారంభించారు. సన్నబియ్యం పథకం దేశానికే ఆదర్శం అని వారు మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సతీశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని 19 రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభమైంది. ప్రతీనెల 15లోగా పంపిణీ చేస్తామని తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండే తెలిపారు. రేషన్ షాపుల్లో లబ్ధిదారులకు స్థానికుల సమక్షంలో యజమానులు సన్నబియ్యం పంపిణీ చేపట్టారు.

సంక్షిప్త వార్తలు

సన్నబియ్యం పంపిణీ నిలుపుదల సరికాదు

బెల్లంపల్లి: సన్నబియ్యం పంపిణీ చేయకుండా నిలుపుదల చేయించడం సరికాదని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేశ్ అన్నారు. బెల్లంపల్లి బజారుఏరియా ప్రాంతంలో రేషన్ షాపుల వద్దకు మంగళవారం సన్న బియ్యం తీసుకువెళ్లడానికి పలువురు లబ్ధిదారులు వచ్చారు. అయితే బియ్యం పంపిణీ జరగకపోవడంతో సమాచారం అందుకుని రమేశ్ అక్కడికి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొందరు కాంగ్రెస్ నాయకులు జోక్యం చేసుకుని ఎమ్మెల్యే వచ్చి బియ్యం పంపిణీ ప్రారంభించే వరకు ఆపాలని డీలర్లను ఆదేశించడం సరికాదన్నారు.

శభాష్ హోంగార్డు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని జాతీయ రహదారిపై తహసీల్దార్ కార్యాలయం ముందు గత కొంతకాలంగా ప్రమాదకరంగా పెద్ద గుంత ఏర్పడింది. ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న హోంగార్డు వెంకటేశ్ తన సొంత ఖర్చులతో ఇసుక, సిమెంట్ తెప్పించి గుంతను పూడ్చివేశాడు. గుంత పూడ్చివేసి పలువురితో శభాష్ వెంకటేష్ అని అనిపించుకున్నాడు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

భీమారం: జిల్లాలో దొంగల ముఠాలు సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్వేత పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం భీమారం పోలీస్‌స్టేషన్‌లో ఆమె మాట్లాడారు. పగటి సమయంలో ఎవరైన అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100 డయల్‌కు ఫోన్ చేయాలన్నారు. అదేవిధంగా ఇతర గ్రామాలకు వెళ్తే పక్కంటివారికి సమాచారం ఇవ్వాలన్నారు.

8న ప్రజాధర్నా

పాతమంచిర్యాల: ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి అజ్మీరా లాల్‌కుమార్ అన్నారు. ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఈ నెల 8న ధర్నా తలపెట్టినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో ధర్నా పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపరేషన్ కగార్ పేరుతో సహజ సిద్ధంగా ఏర్పడిన ప్రకృతి సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఎన్‌కౌంటర్ల పేరుతో జరుగుతున్న హత్యలను అన్నివర్గాల ప్రజలు ఖండించాలన్నారు. అటవీ ప్రాంతాలలోని మిలటరీ బేస్ క్యాంపులను ఎత్తివేసి ఆదివాసులు జీవించే హక్కును కాపాడాలని కోరారు.

గుంత పూడ్చివేయరూ..

వేమనపల్లి: మండల కేంద్రంలోని పాతబస్టాండ్ వద్ద పైపులైన్ మరమ్మతు కోసం రోడ్డుకు ఇరువైపులా మిషన్ భగీరథ సిబ్బంది గుంతలు తవ్వారు. నెల రోజులైనా మరమ్మతు చేపట్టడం లేదు. గుంతలను పూడ్చివేయడం లేదు. ఆదమరిచి వెళ్లే వాహనదారులు ఆ గుంతల్లో పడిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి పైపులైన్ మరమ్మతు చేసి గుంతలు పూడ్చివేయాలని పలువురు కోరుతున్నారు.

